విజయవాడ నగర పోలీస్ కమీషనర్ కార్యాలయము

పత్రికా ప్రకటన తేది.09.08.2018.

# విజయవాడ నగరంలో సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి గారు

ప్రపంచం సాంకేతికపరంగా ఎంతో పురోగభివృద్ధి సాధించి, మనం చేసే ప్రతి దినచర్యను ఆధునిక సాంకేతిక విజ్ఞానం శాసించే స్థాయికి చేరుకుంది. ప్రపంచం మొత్తం డిజిటల్ వ్యవస్థగా మారుతున్న తరుణంలో సాంకేతిక విప్లవం ప్రముఖ పాత్ర వహిస్తుంది. సాంకేతిక విప్లవం వల్ల లాభాలే కాకుండా కొందరి స్వార్ధచింతన మరియు మోసపూరిత ఆలోచనల వల్ల ప్రపంచంలో నిత్యం సైబర్ నేరాలు జరుగుతూనే ఉన్నాయి. సైబర్ నేరాలు జరిగిన తరువాత దర్యాప్తు చేసేకంటే, అవి జరగకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రారంభంలోనే అడ్డుకట్ట వేయాలి. ఈ రోజు మరీ ముఖ్యంగా డీమోనిటైజేషన్ తర్వాత ఆర్థిక లావాదేవీలే కాకుండా, ఆన్‌లైన్ లావాదేవీలు పుకగడం వలన ఈ సైబర్ నేరాలు కూడా బాగా పెరిగాయి అన్ని తరగతుల వారు ఏదో ఒక విధంగా సరైన సాంకేతిక విజ్ఞానం లేకపోవడం వలన సైబర్ నేరాల బారిన పడుతున్నారు. ప్రతి సంవత్సరం ఈ సైబర్ నేరాలు పెరుగుతూన్నాయి. ఈ సైబర్ నేరాలకు సమర్థవంతంగా ఎదుర్కొనడానికి, రాష్ట్ర ప్రభుత్వం విజయవాడకు ఒక ప్రత్యేక సైబర్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. ఒక సి.ఐ.డిలో మాత్రమే సైబర్ నేరాలు కొరకు ప్రత్యేక విభాగం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటిసారిగా విజయవాడలో మొదటి సైబర్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది.

వ్యవస్థలో జరుగుతున్న సైబర్ నేరాలపై దృష్టి సారించి ప్రజలెవరూ సైబర్ మోసాలకు గురికాకుండా ఉండేందుకు విజయవాడ నగర పోలీస్ శాఖ పలు చర్యలు తీసుకోవడం జరిగింది. ఇందులో భాగంగా సైబర్ నేరాలను దర్యాప్తు చేయడానికి అలాగే గత కొంత కాలంగా విజయవాడ నగరంలో సైబర్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రజల నుండి వచ్చిన విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు నగరంలో నూతన హంగులతో పోలీస్ కమీషనర్ కార్యాలయం సమీపంలో సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయగా, ది.09.08.2018న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి శ్రీ ఆర్.పి.ఠాకూర్ ఐపిఎస్ గారు లాంచనంగా ప్రారంభించారు.

సైబర్ నేరాలు జరక్కముందే అరికట్టడానికి విజయవాడ నగర పోలీస్ శాఖ పలు కార్యక్రమాలు చేపట్టింది.

1) ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం.
2) పోలీస్ సిబ్బందికి సైబర్ నేరాలను అరికట్టడానికి పూర్తి శిక్షణ ఇవ్వడం.
3) సైబర్ నేరాలు అరికట్టడానికి ఇంకా ఆధునికి సాంకేతిక సామాగ్రిని సమకూర్చుకోవడం జరిగింది.

నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్ పోలీస్‌స్టేషన్‌లో ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్‌ల పేరుతో జరుగుతున్న మోసాలు, ఏటిఎం కేంద్రాల్లో జరిగే నేరాలు, ఓ.టి.పి. మరియు ఓ.టి.పి. లేకుండా జరుగుతున్న పలు ఆర్థిక మోసాలు, నగదు రహిత లావాదేవీలకు సంబంధించిన మోసాలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ మోసాలు, సాంకేతికంగా క్రొత్త కోణంలో జరుగుతున్న వివిధ రకాల నేరాలను పరిశోధించి, వాటిని ఛేధించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతంది.

సైబర్ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించిన రాష్ట్ర డిజిపి శ్రీ ఆర్.పి.ఠాకూర్ గారు పోలీస్‌స్టేషన్ పనితీరును పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రస్తుత పరిస్థితుల్లో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో సైబర్ పోలీస్‌స్టేషన్ చాలా ముఖ్యమని, సైబర్ నేరాలను నియంత్రించాలంటే నైపుణ్యం కూడిన శిక్షణతో పాటు ప్రశాంతమైన ప్రదేశం అవసరమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా విజయవాడ నగరంలో సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, రెండవ పోలీస్‌స్టేషన్‌ను త్వరలో విశాఖపట్నంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు.

*(మిగతా 2వ పేజీలో ...)*

ప్రస్తుతం ఏర్పాటు చేసిన సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ద్వారా వారం, పది రోజుల్లో ప్రజలకు పూర్తి సేవలను అందించడం జరుగుతుందని తెలియజేశారు. నగదు లావాదేవీలు, ఇంటర్‌నెట్ చాటింగ్, పరిచయాలకు సంబంధించి నేరాలు మరియు మోసాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం పెరుగుతున్నాయని, ప్రస్తుత గణంకాలను బేరీజు వేసుకుంటే భవిష్యత్తులో సైబర్ నేరాలు పెరిగేందుకు అవకాశం ఉందనడంతో ఏమాత్రం అతిశయోక్తిలేదన్నారు.

ప్రస్తుతం పోలీస్ శాఖలో గత సంవత్సరం క్రొత్తగా ఉద్యోగంలో చేరిన వారిని పరిశీలిస్తే వారిలో సుమారు 60 శాతం వరకు బీటెక్, ఎంటెక్ తదితర టెక్నికల్ కోర్సులు చదివిన వారు ఉన్నారని తెలియజేస్తూ, వీరికి సైబర్ క్రైమ్ గురించి శిక్షణ ఇవ్వడం చాలా సులువని పేర్కొన్నారు. వీరికి శిక్షణ ఇచ్చి వినియోగించడం ద్వారా సైబర్ నేరాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతనంగా ఏడు సైబర్ ల్యాబ్‌లను 1) హెడ్‌క్వార్టర్స్ (ట్రైనింగ్ సెంటర్‌గా ఉంటుంది), 2) అనంతపురం పోలీస్ ట్రైనింగ్ సెంటర్ 3) కర్నూలు, 4) రాజమండ్రి, 5) తిరుపతి, 6) విశాఖపట్నం మరియు 7) విజయవాడలలో ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే చర్యలు తీసుకోవడం జరిగిందని, ఈ ల్యాబ్‌ల ద్వారా ముఖ్యంగా సైబర్ క్రైమ్ గురించి శిక్షణ ఇవ్వడం ద్వారా సాంకేతికంగా వృత్తి నైపుణ్యం మెరుగుపర్చడం మరియు సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లను నిర్వహించడం జరుగుతుందన్నారు.

సైబర్ నేరగాళ్ళు అధునాతన సాంకేతిక పరిజ్ఞాన్నా వివిధ రూపాల్లో వినియోగించుకుని ప్రజలను ఉచ్చులో పడవేయడం ద్వారా ఆర్థికంగా మోసగించడం జరుగుతుందని, ఉచితంగా డబ్బు వస్తుందని తెలిపే ఫోన్‌లను, వెబ్‌సైట్లను ముఖ్యంగా మహిళ స్వరంతో వచ్చే ఫోన్ కాల్‌లను నమ్మి, మీ వివరాలు సంబంధిత వ్యక్తులకు అందించి మోసపోవద్దని ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

విజయవాడ రాజధాని నగరం, దేశంలోనే ఉత్తమ నగరంగా తీర్చిదిద్దటానికి అన్ని సౌకర్యాలు కల్పిస్థామని ఇప్పటికే 400 మంది పోలీస్ సిబ్బందిని, పోలీస్ వాహనాలు విజయవాడ నగర పోలీస్ శాఖకు ఇవ్వడం జరిగిందని, సైబర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయటం ద్వారా పెరుగుతున్న సైబర్ నేరాలను విజయవాడ పోలీస్ అరికట్టవచ్చని అన్నారు.

కార్యక్రమంలో విజయవాడ నగర పోలీస్ కమీషనర్ శ్రీ ద్వారకా తిరుమలరావు ఐపిఎస్, పోలీస్ హౌసింగ్ బోర్డు ఛైర్మన్ శ్రీ నాగుల్‌మీరా, టెక్నికల్ సర్వీసెస్ & ట్రైనింగ్ ఐజి శ్రీ ఎన్.సంజయ్, విజయవాడ జాయింట్ పోలీస్ కమీషనర్ శ్రీ టి.కాంతి రాణ ఐపిఎస్ మరియు విజయవాడ నగరంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

---xx---